


# తెలివి

మునిపల్లె
లక్ష్మీ రమణ కుమారి

**"ఏమన్నా అనుకో. వదినా. సమర్థత ఉండాలి కానీ ... హు... ఏమనుకుని ఏం లాభం" ముందు గదిలోంచి మా ఆవిడ మాటలు వినిపిస్తున్నాయి.**

అవి నన్ను ఉద్దేశించి అంటున్నవేనని నాకు స్పష్టంగా తెలిసి పోతోంది. ఇట్లాంటి మాటలు వినటం నాకు కొత్తకాదు. ఎప్పట్నుంచో వింటున్నాను.

బ్రహ్మారావు తెలివిని పొగుడుతూ, నా తెలివి తక్కువని విమర్శిస్తూ మా ఆవిడ ఎప్పట్నుంచో అంటూనే ఉంది. నన్ను కూడా అంత తెలివి నేర్చుకోమని అంటుంది. కానీ నాకు మాత్రం ఆ తెలివి అలవర్చుకోవటం చేతకాలేదు. మా ఆవిడని ఎదుర్కోవడం కూడా రాలేదు. ఏదీ చేతకాక చివరికి అతను చేసే పనులు కూడా తెలివైనవి కావని నిరూపిద్దామని ఎప్పటికప్పుడు విఫల ప్రయత్నం చేస్తుంటాను.

కొన్నేళ్ల క్రితం...

నేనూ, బ్రహ్మారావూ ఒకేసారి ఆఫీసులో చేరాం... ఒకే చోట అద్దెకి దిగాం.

బ్రహ్మారావు కాలానికి తగ్గట్లు పోయే మనిషి. అతనికి కొన్ని సిద్ధాంతాలుండేవి.

"ఏ ఎండకా గొడుగు పట్టాలి. ఏ ఎండకా గొడుగు పట్టటం, ఏ రోటి దగ్గర ఆ పాట పాడటం ఇట్లాంటివి మంచి వాళ్లు చెయ్యని పన్లుగా ఇన్నాళ్లూ చిత్రీకరించారు. కానీ, నాకు తెలీకడుగుతానూ, ఏ ఎండకి తగ్గట్లు ఆ గొడుగు కాక ఇంకో గొడుగు పడితే ఎండకి మాడి చావరూ? అట్లాగే, ఏ రోటి దగ్గర ఆ పాట కాక ఇంకో పాట ఎట్లా పాడతాం. పెళ్లికి పసుపు దంచేదగ్గర ఒక పాట, పిల్ల పెద్దమనిషైతే ఆ రోటి దగ్గర మరోపాట, ధాన్యం దంచే దగ్గర ఇంకోపాట ఇట్లా రకరకాల పాటలు పాడాలి గానీ, ఇక్కడిది అక్కడ పాడితే కొంపలు మునుగుతాయి." అనేవాడు.

"సందర్భానుసారంగా మనిషి ప్రవర్తించాలి. ఎట్లాగో ఒకలాగ డబ్బు సంపాదించాలి," ఇవే అతని సిద్ధాంతాలు.

మా ఆఫీసులో మావి ఎదుగూ బొదుగూ లేని జీతాలు. దాంతో తృప్తి పడటం బ్రహ్మారావు వల్ల కాలేదు. పోనీ లంచాలు పుచ్చుకుని వేణ్నీళ్లకి చన్నీళ్లు అనుకుందామన్నా ఇచ్చేవాడు ఒక్కడూ లేడు.

అయినా బ్రహ్మారావు నిరాశ పడలేదు. సంపాదనకి ఏదో ఒక ఉపాయం చూడాలనుకున్నాడు.

ప్లాట్ల వ్యాపారం చేస్తున్న ఒకరి దగ్గర ఏజంటుగా కుదిరాడు. అందులో బాగా కమీషన్ సంపాదించాడు. రెండు ప్లాట్లు బహుమతిగా

కూడా పొందాడు.

అప్పుడే మా ఆవిడ నన్ను కూడా అట్లాంటిదే దన్నా చూసుకోమని పోరు ప్రారంభించింది.

"వద్దు. మనం హామీగా ఉండి స్థలాలు ఇప్పించాలి. ఓనర్‌షిప్‌లో ఏవన్నా తేడాలు వస్తే కొన్నవాళ్లు తన్ని పోతారు. అసలు మనం గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ ఇంకేవీ చెయ్యకూడదు తెల్సా" అన్నాను.

మా ఆవిడ అఖండురాలు. అంత తేలిగ్గా ఊరుకొనే రకం కాదు.

"నాపేరున నడుస్తుంది కదా" అన్నది.

"నేను రిస్క్ తీసుకోను. నాకు భయం." అన్నాను. ఆక్షణాన మా ఆవిడ నాకేసి చూసిన చూపు నేను జన్మలో మర్చిపోలేను.

ఆ తర్వాత బ్రహ్మారావు తన ప్లాటులో ఇల్లు కట్టడం మొదలు పెట్టాడు.

"వాళ్లు ఇల్లు కూడా కడుతున్నారు. మనం మాత్రం ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నాము" అంది మా ఆవిడ.

నేను సమాధానం చెప్పకుండా ఊరుకున్నాను.

బ్రహ్మారావు కడుతున్న ఇల్లు ఊరికి చివరన. అక్కడ నుంచి ఆఫీసుకి రావటం, బిజినెస్ పనులు చూసుకోవటం చాలా కష్టం. అదీ గాక ఊరి చివర ఉన్న కాలనీలో కాబట్టి దొంగలు పడి దోచుకు పోతుంటారు. రక్షణ లేదు. ఈ బాధలు పడలేక బ్రహ్మారావు ఇల్లు ఖాళీచేసి మళ్లీ ఇక్కడికే అద్దెకి వచ్చేస్తాడనిపించింది నాకు.

బ్రహ్మారావు అక్కడే ఉండిపోయాడు.

కాపలా కోసం కుక్కని కొన్నాడు.

కుక్క ఖరీదు మూడు వేలు. పైపెచ్చు దానికి తిండికోసం అయే ఖర్చు బోలెడు.


"అనవసరంగా కష్టపడుతున్నావు" అన్నాను.

"కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుంది" అని నవ్వేశాడు.

"ఏం ఫలితం - బిక్కుబిక్కుమంటూ బతకటం, ఆ కుక్క మొహాన బోలెడు డబ్బు పోయటం, ఇంతేగా" అన్నాను.

"చక్కటి గాలి, వెలుతురు ప్రశాంత వాతావరణం ఇవేవీ, కనిపించవేం నీకు" అన్నాడు బ్రహ్మారావు.

అతను చేసే ప్రతి పనీ ఏదో ఒక ఉద్దేశంతోనే కూడుకుని ఉంటుందని మా ఆవిడ అభిప్రాయం.




ఆవిడ అభిప్రాయమే నిజమైంది.

ఖాళీ స్థలంలో రకరకాల చెట్లు పెంచాడు బ్రహ్మారావు. తాజా కూరలతో హాయిగా భోంచేస్తున్నాడు. ఎక్కువ కాస్తే అమ్ముకుని లాభం గడిస్తున్నాడు.

ఇంతే అయితే గొప్ప లాభం లేకపోయేది. కానీ ఏ కుక్క కోసం బ్రహ్మారావు అనవసరంగా డబ్బు ఖర్చు పెడుతున్నాడని భావించానో ఆ కుక్క వల్లే బోలెడు లాభం పొందాడు.

ఆ కుక్క పిల్లల్ని పెట్టింది. వాటిని అమ్మి వేలకు వేలు సంపాదించాడు. అట్లా దాని మీద బోలెడు డబ్బు సంపాదించాడు.

బ్రహ్మారావు తెలివి ముందు నేనెందుకూ పనికి రానని అర్థమై పోయింది నాకు. అప్పట్లో అతని స్థలానికి దగ్గరలో నాకూ స్థలం చూపించాడు. కానీ ఊరికి చివర వద్దు లెమ్మన్నాను. ఆ తర్వాత ఊరు పెరిగి పోయి అదే స్థలం సెంటర్‌గా మారింది. ఇప్పుడు అదే స్థలం ధర కొన్ని రెట్లు పెరిగిపోయింది. కొనటం నా తరం కాదు.

"బ్రహ్మారావు ఇనుకలో ఖర్జూరం పండించగలడు. సముద్రంలో పారేస్తే మాణిక్యాలతో తిరిగొస్తాడు." ఇవి నా అభిప్రాయాలు కావు. తెలిసిన వాళ్లంతా అనుకుంటున్న మాట.

అతని ప్రతిష్ఠతో పాటు మా ఆవిడ పోరు కూడా పెరిగి పోతోంది.

ఆవిడని ఎట్లా ఎదుర్కోవాలో నాకు అర్థం కావటం లేదు. బ్రహ్మారావులో ఏదన్నా లోపం దొరికితే బాగుండుననిపిస్తోంది.

ఇంతలో ఆ అవకాశం రానే వచ్చింది.


ఇన్ని విషయాల్లో ఇంత తెలివిగా ఉండే బ్రహ్మారావు, ప్రతిదీ తనకి ప్రయోజనంగా ఉండేట్లు మలుచుకునే బ్రహ్మారావు, తన ఏకైక పుత్రరత్నం విషయంలో మాత్రం తెలివిగా ఉండలేక పోయాడు.

వాడు ఎందుకూ పనికిరాని వాడిగా తయారయ్యాడు. పదోక్లాసు పాసవటమే బ్రహ్మ ప్రళయం అనుకున్నారు అందరూ. కానీ బ్రహ్మారావు మరి ఎవరి కాళ్లు పట్టుకున్నాడో, ఇంకెవరి చేతులు పట్టుకుని ప్రార్థించాడో, ఏ ఏ తిప్పలు పడ్డాడో కానీ మొత్తానికి వాడిని మంచి మార్కులతో పాస్ చేయించాడు.

అక్కడితో కాలేదు. వాడికి ముప్పై వేలు కట్టి "బ్లూరోజ్ జూనియర్ కాలేజీ"లో ఇంటర్మీడియట్‌కి సీట్ సంపాదించాడు.

బ్లూ రోజ్ జూనియర్ కాలేజీ ఊళ్లో ఉన్న అతి మంచి జూనియర్ కాలేజీల్లో ఒకటి. తమ పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదివి, ప్రయోజకులవాలని అనుకునే వాళ్లంతా వాళ్లని అక్కడ చేర్పిస్తారు. అక్కడ చాలా క్రమశిక్షణతో ఉంచుతారు. చచ్చేట్లు చదవాలి. పిచ్చి వేషాలు వెయ్యటానికి వీల్లేదు. బ్రహ్మారావు కొడుకు అక్కడ క్షణం కూడా ఇమడలేడని పించింది నాకు. వాడికి ఏ మాత్రం కుదురు లేదు. క్రమశిక్షణ అసలే లేదు. చదువు సంగతి చెప్పక్కర్లేదు.

ఇట్లాంటి వాళ్లని వాళ్లు వాళ్ల కాలేజీలో ఉంచుకోరు. తెలియక సీటు ఇచ్చినా, వీడి బుద్ధులు బయట పడగానే శుభ్రంగా ఇంటికి పంపేస్తారు.




అనుకున్నంత పనీ అయింది.

బ్రహ్మారావు కొడుకు అక్కడికి వెళ్లి నానా అల్లరీ మొదలు పెట్టాడు. క్లాసులు ఎగ్గొట్టడం, లెక్చెరర్లని ఏడిపించటం, పోకిరీ వేషాలు వేయటం, వాడి లీలలు ఒకటని కాదు, అనేకం ప్రదర్శించటం మొదలు పెట్టేసరికి కాలేజీ పెద్దలకి మతి పోయింది.

వాడికి టి.సి. ఇచ్చి ఇంటికి పంపేద్దామని చూశారు.

వాడు పెద్ద గొడవ చేశాడు. అనేక మందిని వెంటేసుకుని అల్లరీ, ఆగమూ చేశాడు. రగడ జరిగింది.

ఏమీ లాభం లేకపోయింది. పది రోజుల పాటు గొడవ జరిగినా, చివరికి వాడిని కాలేజీ నుంచి పంపేశారు.

ఆ సంగతి తెలిసి బ్రహ్మారావుని పలకరిద్దామని వెళ్లాను. ఎందుకంటే బ్రహ్మారావు నాకు బాగా స్నేహితుడు. ఇట్లాంటి పరిస్థితిలో ధైర్యం చెప్పాల్సిన బాధ్యత నామీదుంది.

బ్రహ్మారావు ఆఫీసుకి రావటం లేదు కూడా. పాపం ఎంత కుంగిపోయాడో అని బాధగా ఉంది.

ఏం మాట్లాడాలో, ఎలా పలకరించాలో అర్థంకాక పోయినా, పోనీలే, ఇక మీదట బుద్ధిగా చదువుకుంటాడని ధైర్యం చెప్తే చాలనుకున్నాను.

గేటు తీసుకుని లోపలికి వెళ్లాను. కుక్కని దువ్వుతూ కూర్చున్న బ్రహ్మారావు వాకిట్లోనే దర్శనమిచ్చాడు.

దిగులుగా, నీరసంగా కనిపిస్తాడేమో అనుకున్న నా అంచనా తలకిందులు చేస్తే నవ్వుతూ పలకరించాడు.

"రా. రా. ఇంత దూరం వచ్చావేం" అన్నాడు ఆప్యాయంగా ఆహ్వానిస్తూ.

కాసేపు అవీ ఇవీ మాట్లాడాడు.

పుత్రరత్నం లోపల డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని డజను పైగా ఇడ్లీలు లాగిస్తూ కనిపించాడు.

"పిల్లాడి సంగతి విన్నాను. బాధపడకు. ముందు ముందు బుద్ధొచ్చి వాడే చదువుకుంటాడులే" అన్నాను.

బ్రహ్మారావు ఫెళ్లున నవ్వాడు.

"బాధ దేనికీ?" అన్నాడు.

"పిల్లాడి చదువు చెడిందిగా"

"ఏం చెడితే? ఈ రోజుల్లో చదువెవడికి కావాలి? డబ్బు సంపాదించగలిగే తెలివీ, దాన్ని నిలబెట్టుకోగలిగే గూండాగిరీ ఉంటే చాలు. హాయిగా బతకొచ్చు. సంపాదించే తెలివి నాకుంది. గూండాగిరీ వాడి దగ్గర ఉంది చాలు. ఇప్పటికే బాల గూండాగా వాడికి మంచి పేరు వచ్చింది. ముందు ముందు రాజకీయాల్లో ప్రవేశించటానికి కూడా ఇది పనికొస్తుంది" అన్నాడు బ్రహ్మారావు.

బ్రహ్మారావు నన్నో తెలివి తక్కువ వాడిని చూసినట్లు చూస్తుంటే నాకు ఉక్రోషం ముంచుకొచ్చింది.

"అయితే మాత్రం. పోనీ, నువ్వు కట్టిన ముప్పై వేలూ నష్టమేగా" అన్నాను.

"కాదు డెబ్బై వేలు లాభం. మా వాడిని మాత్రం ఆ కాలేజీలో నుంచి తీసెయ్యటానికి వీల్లేదని బెదిరించే సరికి, మానేజ్‌మెంట్ హడలి చచ్చి, నన్ను బతిమాలి 'లక్షరూపాయలు ఇస్తాం, తీసుకు పొమ్మని' కాళ్ల బేరానికి వచ్చారు తెల్సా. వాళ్ల మొహం చూసి, జాలేసి, ఆ లక్ష రూపాయలూ తీసుకుని పిల్లాడిని ఇంటికి తీసుకు పోవటానికి ఒప్పుకున్నాను. అంతేకాదు. టి.సి.లో వాడి మీద చెడ్డగా ఏం రాయలేదు. వేరే ఏ కాలేజీలోనైనా హాయిగా చేరొచ్చు. కానీ ప్రైవేట్‌గానే కట్టిద్దామని చూస్తున్నాను." అన్నాడు.

నాకు నోట మాట రాలేదు.

"లక్షరూపాయలిచ్చారా?" అన్నాను, ఎట్లాగో నోరు పెగల్చుకుని.

"ఇవ్వక చస్తారా? తా చెడ్డకోతి వనమెల్లా చెరిచిందని, వీడు మిగతా పిల్లలందర్నీ కూడా చెడగొడ్తున్నాడని భయపడి చచ్చి, వీడు వదిలి పోతే అంతే చాలనుకున్నారు" బ్రహ్మారావు చచ్చేట్లు నవ్వుతున్నాడు.

ఏ విషయమైనా తనకి అనుకూలంగా మల్చుకునే బ్రహ్మారావు శక్తి నాకు ఇప్పుడు పూర్తిగా అర్థమైంది.

ఈ సంగతి తెలిస్తే మా ఆవిడ నన్నింకేమంటుందో. ఓదార్చాలని వెళ్లిన వాడిని నన్ను నేనే ఓదార్చుకుంటూ తిరిగి వచ్చాను. ●



మహాకవి

ఓ మహారచయిత గారింట్లో వారి పుస్తకాల బీరువాలో.... వారు రచించిన గ్రంథాలను తిరగేస్తున్న ఓ అమ్మాయి ఇలా అడిగింది -

అక్కయ్యాగారూ ! బావగారికి ఇన్ని బిరుదులు ఎవరిచ్చారు ?

అంతటి మహాకవులకు ఒకరు ఇవ్వాలా ? మంచిరోజు చూసివారే పెట్టుకున్నారు.

- దుర్గ.